కనువిందు.. నృత్య ప్రదర్శనలు



మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా తాశీత రంగ్‌ నర్తకీమణులు గోపిక మోహన్‌, ఆర్థ, స్వాధన, అస్వతే, అపర్ణలు భరతనాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. వర్ణం, మాతే తదితర అంశాలను ప్రదర్శించారు. అరుణోదయ కళాసమితి లత మంజూష తన శిష్యబృందంచే అయిగిరి నందిని, వినాయకస్తుతి, జతిస్వరం, తరంగం, అష్టలక్ష్మి, అన్నమాచార్య కీర్తన, స్వాగత నృత్యం తదితర అంశాలను కళాకారులు వర్ష, సహస్ర, పంటశ్రీ, నిత్య, దీక్షిత, సింధు, మానస, విజయ తదితరులు ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం శారదా సంగీత విద్యాలయం విద్యార్థులచే అన్నమయ్యపుర స్వర నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువు మంజులపూరి శిష్యబృందంచే శరణు గజముఖ, వేడుకుందామా, గురుతెరిగిన దొంగ, బ్రహ్మమొక్కడే, గోవిందాశ్రిత, చిన్నిశిశువు, చూడమ్మ సతులారా, జగడపు చనువుల జాతర తదితర కీర్తనలు ఆలపించారు. వీరికి వయోలిన్‌ షణ్ముఖశర్మ, మృదంగం మల్లికార్జున్‌ వాయిద్య సహకారాన్ని అందించారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్‌ శోభారాజు కళాకారులకు జ్ఞాపికలను అందజేసి సన్మానించారు.



మెట్రో వస్తే.. మరింత అభివృద్ధి



మారనున్న ఖాజాగూడ, నానక్‌రాంగూడ పరిసర ప్రాంతాల రూపురేఖలు

రాయదుర్గం మెట్రోస్టేషన్‌ నుంచి కోకాపేట్‌ నియోపోలీస్‌ వరకు రూట్‌



మధురానగర్‌ నుంచి నానక్‌రాంగూడ ఓఆర్‌ఆర్‌ అండర్‌బ్రిడ్జి వరకున్న మోడల్‌రోడ్డు మధ్య డివైడర్‌పై మెట్రో పిల్లర్లు ఏర్పాటు చేయాలని సంకల్పించిన ప్రాంతం ఇదే



మెట్రో రైలు రూట్‌ మ్యాప్‌

రాయదుర్గం: మెట్రో రైలు రాకతో ఈ ప్రాంత రూపురేఖలు మారుతాయని ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే మధురానగర్‌ నుంచి ఖాజాగూడ మీదుగా నానక్‌రాంగూడ వరకు మోడల్‌ రోడ్డు నిర్మాణంలో డివైడర్‌ మధ్య భారీ స్థలం కేవలం మెట్రో ఏర్పాటు కోసం వదిలేయడంతో భూ సమస్య కూడా చాలా వరకు తగ్గిపోయింది. ఆ తర్వాతి ప్రాంతాలలోనే కొంతవరకు సమస్య తలెత్తే అవకాశముంది. ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌ ఏర్పాటుతో బస్సులు తగ్గాయని మధురానగర్‌, ఖాజాగూడ, ప్రశాంత్‌హిల్స్‌, సాయిఐశ్వర్య, సాయివైభవ్‌ కాలనీలు, నానక్‌రాంగూడ పరిసర కాలనీవాసులు భావిస్తున్న నేపథ్యంలో మెట్రోరైలు ప్రకటనతో అందరిలోనూ సంతోషం వ్యక్తమవుతోంది.

మెట్రో రూట్‌ ముఖ్యాంశాలు...

- రెండవదశ కింద మైండ్‌స్పేస్‌ నుంచి బయోడైవర్సిటీ పార్కు మీదుగా మధురానగర్‌, ఖాజాగూడ, నానక్‌రాం గూడ వరకున్న ప్రధాన రోడ్డు మధ్యన పిల్లర్లు ఏర్పాటు చేసి మెట్రో ట్రాక్‌ను ఏర్పాటు చేయడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించారు.
- వచ్చే నాలుగేళ్లలో ఈ రూట్‌లో మెట్రో సౌకర్యం ఏర్పడేలా చేయాలని సంకల్పించారు.
- ఈ రూట్‌లో 10 మెట్రో స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం

రాయదుర్గం మెట్రోస్టేషన్‌- కోకాపేట్‌ నియో పోలీస్‌ మెట్రోస్టేషన్‌ మధ్య 10 స్టేషన్లు

- రాయదుర్గం మెట్రో స్టేషన్‌ నుంచి కోకాపేట్‌ నియో పోలీస్‌ మెట్రో స్టేషన్‌ మధ్య 10 స్టేషన్లు ఏర్పాటు చేయాలని అధికార యంత్రాంగం సంకల్పించింది. మాదాపూర్‌ ఐటీ కారిడార్‌ నుంచి హైదరాబాద్‌ నాలెడ్జి సిటీ మీదుగా ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌ ప్రాంతంను కలిపేలా ఈ రూట్‌ ఏర్పాటు చేశారు.
- మైండ్‌స్పేస్‌లోని రాయదుర్గం మెట్రోస్టేషన్‌ నుంచి బయలుదేరిన తర్వాత బయోడైవర్సిటీ జంక్షన్‌, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, గోల్ఫ్‌కోర్టు, విప్రో సర్కిల్‌, పుప్పాల్‌గూడ ,ఓఆర్‌ఆర్‌ జంక్షన్‌, ఖానాపూర్‌ ,మూవీ టవర్స్‌, కోకాపేట్‌ నియోపోలీస్‌ పది మెట్రో స్టేషన్లు ఏర్పాటు చేస్తారు.ఈ స్టేషన్ల ఏర్పాటుతో చేరువలోని గచ్చిబౌలి డివిజన్‌లోని మధురానగర్‌, ప్రశాంత్‌ హిల్స్‌, సాయిఐశ్వర్య, సాయివైభవ్‌, చిత్రపురి కాలనీ, మణికొండ, గొలిదొడ్డి, కేశవనగర్‌, బసవతారకనగర్‌ వంటి ప్రాంతాల వారికి కూడా ఎంతో మేలు చేకూరే అవకాశం లేకపోలేదు.

టెలికాం అడ్వైజరీ బోర్డు సభ్యులు బుచ్చిరెడ్డికి సన్మానం



బుచ్చిరెడ్డిని సన్మానించిన చింతకింది గోవర్ధన్‌గౌడ్‌ తదితరులు

చందానగర్‌: టెలికాం అడ్వైజరీ బోర్డు సభ్యులుగా నియమితులైన పోరెడ్డి బుచ్చిరెడ్డిని శనివారం లింగంపల్లిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది గోవర్ధన్‌గౌడ్‌ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ నందకుమార్‌ హాజరై మాట్లాడుతూ బీజేపీ లో ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శాంతిభూషణ్‌ రెడ్డి, రాంరెడ్డి, నీరిటి చంద్రమోహన్‌, విజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ మంజూరుపత్రం అందజేత



బాధిత కుటుంబానికి మంజూరుపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్‌: కొండాపూర్‌ డివిజన్‌ పరిధిలోని మార్తాండనగర్‌కి చెందిన స్వరూపకు అత్యవసర వైద్యచికిత్స నిమిత్తం మంజూరైన రూ.2.50 లక్షలు మంజూరు పత్రాన్ని శనివారం పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు చంద్రకాంత్‌ రావు, కాశీనాథ్‌ యాదవ్‌, ఎంఐపీ ఇబ్రహీం, క్రాంతి, పురెందర్‌రెడ్డి, స్వరూప కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సును విజయవంతం చేయాలి

ఎంసీపీఐయూ గ్రేటర్‌ హైదరాబాద్‌ కార్యదర్శి రమేష్‌



సెమినార్‌ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

మియాపూర్‌: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నవంబర్‌ 7వ తేదీన జరగబోయే జాతీయ సెమినార్‌ను విజయవంతం చేయాలని ఎంసీపీఐయూ గ్రేటర్‌ హైదరాబాద్‌ కార్యదర్శి మైదంశెట్టి రమేష్‌ పిలుపునిచ్చారు.మియాపూర్‌ ఎంఏనగర్‌ పార్టీ కార్యాలయం ముందు గ్రేటర్‌ హైదరాబాద్‌ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ సెమినార్‌ వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌ ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, మతోన్మాద కార్పొరేట్‌ శక్తుల ప్రమాదం, వామపక్ష కమ్యూనిస్టు శక్తుల కర్తవ్యం అనే అంశాలపై సెమినార్‌ జరుగుతుందని, ఈ సెమినార్‌కు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రేటర్‌ హైదరాబాద్‌ సహాయ కార్యదర్శి అనిల్‌కుమార్‌, కార్యదర్శి వర్గ సభ్యులు ఇస్లావత్‌ దశరథ్‌ నాయక్‌, పల్లె మురళి, భాగ్యమ్మ, మధుసూదన్‌, నారాయణ, ఆకుల రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

సేకరణ సజావుగా జరగాలి

- రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- అధికారులకు కలెక్టర్‌ ఆదేశం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్‌ క్రాంతి

పటాన్‌చెరు: ఖరీఫ్‌ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్‌ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. పటాన్‌చెరు మండలం బచ్చుగూడెంలో సహకార సంఘాల ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం రెవెన్యూ అదనపు కలెక్టర్‌ మాధురితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చిన రైతులను క్రమ సంఖ్య ప్రకారం నమోదు చేసుకుని త్వరగా తూకం వేయాలని కేంద్రాల ఇన్‌చార్జీలను ఆదేశించారు. కేంద్రాల వద్ద అవసరమైన ప్యాడీ క్లీనర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. పంట నాణ్యతపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ధాన్యం విక్రయించిన రైతులకు వివరాలు ట్యాబ్‌లో వెంటనే నమోదు చేయాలని సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా లోటు పాట్లు ఉంటే సరిచేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అకాల వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఒక బస్తాకు 40 కిలోల కన్నా ఎక్కువ తూకం వేయవద్దని ఆదేశించారు. అంతకుముందు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా'అని అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది రైతులు ధాన్యం తీసుకొచ్చారని వివరాలు కేంద్రం ఇన్‌చార్జీలను అడిగి తెలుసుకున్నారు. రైతులకోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివకుమార్‌, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌ రెడ్డి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్‌ కొండలరావు, జిల్లా సహకారశాఖ అధికారి కిరణ్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొండాపూర్‌, గచ్చిబౌలి.. విద్యుత్‌ సమస్యల పరిష్కార వేదిక

కూకట్‌పల్లి: విద్యుత్‌ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విద్యుత్‌ వినియోగదారుల సేవా కేంద్రం కేపీహెచ్‌బీ సబ్‌స్టేషన్‌ ఆవరణలో నిర్వహించనున్నట్లు కొండాపూర్‌ డివిజనల్‌ ఇంజనీర్‌ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సేవా కేంద్రంలో కొండాపూర్‌, గచ్చిబౌలి పరిధిలోని విద్యుత్‌ వినియోగదారులు పాల్గొని సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్‌ వినియోగదారులు గమనించాలని కోరారు.

శిల్పారామంలో సెట్విన్‌ స్టాల్‌ ప్రారంభం



స్టాల్‌ను ప్రారంభిస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మాదాపూర్‌: మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన సెట్విన్‌స్టాల్‌ను శనివారం సంస్థ చైర్మన్‌ గిరిధర్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెట్విన్‌లో శిక్షణ పొందిన వారు తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్‌ చేసుకునేందుకు శిల్పారామంలో స్టాల్‌ను ఏర్పాటు చేసి నట్టు తెలిపారు. త్వరలోనే ఉప్పల్‌ శిల్పారామంలో కూడా స్టాల్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సంస్థ మేనేజింగ్‌ డైరెక్టర్‌ కె.వేణుగోపాల్‌, సెట్విన్‌ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సదర్‌ ఉత్సవాలు



సదర్‌ ఉత్సవాలలో పాల్గొన్న స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌ కుమార్‌ తదితరులు



ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

చందానగర్‌: దీపావళి సందర్భంగా చందానగర్‌ గంగారం గ్రామం, అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌ కాలనీలలో శనివారం సదర్‌ ఉత్సవాలు పి.ఉదయ్‌ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌ కుమార్‌, పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్‌ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌ గౌడ్‌, ఎంబీసీ చైర్మన్‌ జైపాల్‌, బీజేపీ కంటెస్టెడ్‌ ఎమ్మెల్యే రవికుమార్‌ యాదవ్‌, కార్పొరేటర్లు మంజుల రఘునాథ్‌రెడ్డి, రాగం నాగేందర్‌ యాదవ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సదర్‌ ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం సదర్‌ ఉత్సవాలలో భాగంగా దున్నపోతుల విన్యాసాలు వీక్షించారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌ యాదవ్‌, కాలనీవాసులు వెంకట్రాజ్‌, దినేష్‌, దిలీప్‌ వినీత్‌, విశాల్‌, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివయ్యకు పూజలు



ఆల్విన్‌కాలనీ: కార్తీకమాసం ప్రారంభమైంది. శనివారం కూకట్‌పల్లి సర్కిల్‌ పరిధిలోని శైవ క్షేత్రాలతో పాటు వైష్ణవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. పెద్ద సంఖ్యలో ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. స్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. కూకట్‌పల్లి పాత శివాలయం, కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ ఏకాంబరేశ్వర శివాలయం, ఆల్విన్‌ కాలనీలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం, జగద్గిరిగుట్టలోని వేంకటేశ్వరనగర్‌లోని మంజునాథ ఆలయం, వివేకానందనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఆలయాల్లో జ్వాలా తోరణం నిర్వహించారు.

విద్యార్థుల హర్షం

పటాన్‌చెరు టౌన్‌: ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు డైట్‌, కాస్మోటిక్‌ చార్జీలను పెంచడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్ల గ్రామంలోని తెలంగాణ ట్రైబల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. రీజినల్‌ కోఆర్డినేటర్‌ సుధాకర్‌, కళాశాల ప్రిన్సిపాల్‌ మహేశ్వరి పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ మూడవ ఫేజ్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్‌ మందడి శ్రీనివాసరావుతో కలిసి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్‌ బాబూరావు, ఆలయ చైర్మన్‌ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ లైన్‌మెన్‌ మృతి

గచ్చిబౌలి: మద్యం మత్తులో కిందపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాయదుర్గంలో నివాసం ఉండే గడ్డమీది కుమార్‌(45) జహీరాబాద్‌లో లైన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. తాగుడుకు బానిస అయ్యాడు. దీపావళి రోజు రాత్రి అతిగా మద్యం సేవించి ఇంటికి వెళ్లి భార్యతో గొడవ పడ్డాడు. అనంతరం నడుచుకుంటూ వెళుతూ కాలనీలో కిందపడిపోవడంతో కుటుంబ సభ్యులు రాయదుర్గంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. అతిగా మద్యం తాగి పడిపోవడంతో శ్వాస ఆడక మృతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యేకు వినతి



చందానగర్‌: మాదాపూర్‌ డివిజన్‌ పరిధిలోని మాతృశ్రీనగర్‌ కాలనీలో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కాలనీవాసులు శనివారం పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని కలిసి వినతిపత్రం అందించారు. కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని, అవసరమున్న చోట యూజీడీ పైప్‌లైన్‌ వేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ త్వరలోనే కాలనీలో పర్యటిస్తానన్నారు.కార్యక్రమంలో కాలనీవాసులు అనిల్‌ కావూరి, నాగరాజు, కిషోర్‌, విజయ్‌, చందు, రమణ, గోపి, సతీష్‌, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్యాచ్‌ వర్క్‌ పనులు పరిశీలన

మణికొండ: జలమండలి, డ్రైనేజీ పనులతో రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపడతామని మణికొండ మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్‌ కె.రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం వార్డులో కొనసాగుతున్న ప్యాచ్‌ వర్క్‌ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మున్సిపాలిటీ పరిధిలో చాలా వరకు రోడ్లు వేశాక తిరిగి గుంతలు తీయడంతో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయన్నారు. మరమ్మతులకు వార్డుల వారీగా నిధులను కేటాయించారని, త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందన్నారు.

లీకేజీలు.. తాగునీటి వృథా

- లీకేజీలతో పైపులైన్‌లో కలుషిత జలాలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీల ప్రజలు
- మరమ్మతులు అంతంతే

జలమండలి అధికారుల అలసత్వం కారణంగా తాగునీటి పైపులైన్లు లీకేజీ కావడంతో వాటిలో కలుషిత జలాలు కలిసి సరఫరా అవుతున్నాయి. కూకట్‌పల్లి సర్కిల్‌ పరిధిలో కాలం చెల్లిన తాగునీటి పైపులైన్లతో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో లీకేజీలతో నీరు రోడ్లపై ఏరులై పారుతుంది. గ్యాలన్ల కొద్ది తాగునీరు వృథాగా పోతుండటంతో స్థానికులు అధికారులపై తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. – ఆల్విన్‌కాలనీ



ఆల్విన్‌కాలనీ నాలా బ్రిడ్జి వద్ద రోడ్డుపై ప్రధాన పైపులైన్‌ లీకేజీతో పారుతున్న తాగునీరు

కూకట్‌పల్లి సర్కిల్‌ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్‌, హైదర్‌నగర్‌, కూకట్‌పల్లి డివిజన్‌లలోని పలు కాలనీల్లో తాగునీటి పైపులైన్ల లీకేజీతో నీరు రోడ్లపై పారుతుంది. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులుపడుతున్నారు. మురుగు కలుస్తుండడంతో తాగునీరు దుర్వాసన వస్తుందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. నిత్యావసరాలకు కూడా వాడుకోవటానికి పనికి రావటం లేదు. ప్రధాన పైపులైన్‌లు శిథిలావస్థకు చేరుకోవటం, మరమ్మతులు చేసినా కొద్ది రోజులకే ఆ ప్రాంతంలో తిరిగి లీకేజీలు ఏర్పడుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

పైపులైన్‌ లీకేజీ ప్రాంతాలు

- ఆల్విన్‌కాలనీ పైపులైన్‌ రోడ్డులోని నాలా బ్రిడ్జి వద్ద కొద్దిరోజుల క్రితమే ప్రధాన పైపులైన్‌ లీకేజీ కావడంతో మరమ్మతులు చేసి మమ అనిపించారు. కొద్ది రోజులు కూడా గడవక ముందే అదే ప్రాంతంలో మళ్లీ లీకేజీ ఏర్పడింది.
- పైపులైన్‌ రోడ్డులోని ఎస్‌ఎస్‌డీ స్కూల్‌ సమీపంలో ప్రధాన రహదారిలో ప్రధాన పైపులైన్‌ లీకేజీతో గ్యాలన్ల కొద్దీ తాగునీరు వృథాగా పోతోంది.
- పైపులైన్‌ రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్‌ బంక్‌ ముందు పైపులైన్‌ నుంచి తాగునీరు కొన్ని రోజులుగా లీకేజీ అవుతుందని స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు.
- ఆస్‌బెస్టాస్‌ కాలనీ వాటర్‌ ట్యాంక్‌ వద్ద పైపులైన్‌ వాల్వ్‌ లీకేజీతో రహదారుల వెంట తాగునీరు వృథాగా పోతున్నది.
- చిత్తారమ్మ దేవాలయ సమీపంలోని ప్రధాన కూడళ్ల వద్ద మ్యాన్‌హోల్‌ వాల్వ్‌ లీకై నీరు వృథాగా పోవడమే కాకుండా చెత్తా చెదారం వాల్వ్‌లో చేరి సరఫరా అవుతున్నాయి.
- కూకట్‌పల్లి, వివేకానందనగర్‌ కాలనీ బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ముందు కొన్ని నెలలుగా వాల్వ్‌ లీకై తాగునీరు వృథాగా పోతుంది.
- జగద్గిరిగుట్ట ఇందిరా గాంధీ విగ్రహం ముందు.. అలాగే భాగ్యనగర్‌ కాలనీలోని గోవింద్‌ హోటల్‌ చౌరస్తాలో తాగునీటి పైపులైన్‌ లీకేజీతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులుపడుతున్నారు.



వివేకానందనగర్‌ కాలనీ బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ముందు..



ఆల్విన్‌కాలనీలోని ఎస్‌ఎస్‌డీ స్కూల్‌ వద్ద రోడ్డుపై లీకవుతున్న తాగునీరు

ఇలా పలు ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్‌లు లీకేజీతో కలుషిత నీటి సరఫరాతో ప్రజలు అస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. సమస్య పునరావృతం అయినప్పుడల్లా అధికారులు తూతూ మంత్రంగా పనులు మమ అనిపించటం తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటి పైపులైన్ల లీకేజీలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ఉపాధి కల్పనే లక్ష్యంగా విద్యలో మార్పులు



వీసీని సన్మానిస్తున్న సిబ్బంది, తూటా సంఘ సభ్యులు

ఏజీవర్సిటీ: ఉద్యాన విద్యార్థులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా విద్యలో మార్పులు తీసుకొస్తామని కొండా లక్ష్మణ్‌ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి దండా రాజిరెడ్డి అన్నారు. శనివారం ఆయన రాజేంద్రనగర్‌ ఉద్యాన కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ హార్టికల్చరల్‌ యూనివర్సిటీ టీచర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వీసీ మాట్లాడారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని పెంపొందించుకోవడంతో బాటు ఉద్యాన పంటల సాగులో ఆధునిక పోకడలను తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూటా సంఘం నాయకులు, విశ్వవిద్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేకు సహకరించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటి సర్వేను ప్రణాళికబద్ధంగా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్‌ కమిషనర్‌ సంగారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెల్లాపూర్‌ మున్సిపాలిటీతో పాటు తాజాగా మున్సిపల్‌లో విలీనమైన గ్రామాల్లో సైతం సర్వే చేస్తున్నట్లు వివరించారు. అందుకు 189 టీములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్వేకు వచ్చేవారికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.